సాక్షి
ఖమ్మం
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



## మరి ఎవరిది బాధ్యత?

కేఎంసీ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఈఎండీ, ఎఫ్ఎస్‌డీల చెల్లింపుల్లో కొందరు ఉద్యోగుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. IIలో



## మళ్లీ సమ్మెబాట

రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి కమీషన్ బకాయి ఉండడంతో వచ్చేనెల షాప్‌లు తెరవకుండా సమ్మెకు దిగుతామని ప్రకటించారు. IIలో



గరిష్టం / కనిష్టం
27° / 23°

## వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న పద్మావతి అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. శ్రీవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పద్మావతి అమ్మవారిని మహాలక్ష్మీదేవి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకోగా, మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



విద్యార్థి దేవీశ్రీ ప్రసన్నను సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు శ్రద్ధతో చదవాలని, తద్వారా అధ్యాపకులు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక అధికారి హేమచందర్ సూచించారు. ఖమ్మం ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్ – టీచర్ సమావేశంలో ఆయన డీఐఈఓ రవిబాబు, డీఎంహెచ్ఓ కళావతిబాయితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికాయుతంగా చదివితే లక్ష్యసాధన సులువవుతుందని తెలిపారు. ఇటీవల రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యాన పాట్నాలో నిర్వహించిన రీజినల్ స్థాయి క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించిన దేవీశ్రీ ప్రసన్నను సన్మానించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల చదువు, హాజరుపై సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ – టీచర్స్ సమావేశంలో డీఐఈఓ రవిబాబు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందనే సమాచారంతో అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం టీటీడీసీ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా హాజరై సూచనలు చేశారు. అలాగే, భక్తరామదాసు కళాక్షేత్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు ఎంపిక చేసిన ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వగా జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతంతో పాటు సద్దుల బతుకమ్మ, దుర్గాష్టమి, దసరా, గాంధీ జయంతి సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుస సెలవులు ప్రకటించారు. ఈనెల 27, 28వ తేదీల్లో శని, ఆదివారాలు వారాంతపు సెలవులు వచ్చాయి. ఆతర్వాత 29వ తేదీన సోమవారం మార్కెట్ నిర్వహణ కొనసాగుతుంది. ఇక 30వ తేదీ మంగళవారం దుర్గాష్టమి, అక్టోబర్ 1న బుధవారం మహర్నవమి, 2వ తేదీ గురువారం విజయ దశమి, గాంధీజయంతి సందర్భంగా సెలవులు ప్రకటించారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గుర్తించాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు.

# ఇస్తారా.. ఇవ్వరా?

జిల్లాలో యాసంగి సీజన్‌లో సన్నధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించగా.. సీజన్‌లో రైతులు 12,70,653 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కేంద్రాల్లో విక్రయించారు. కేంద్రాల్లో సౌకర్యాలు సరిగ్గా లేకున్నా బోనస్ అందుతుందనే ఆశతో అక్కడే అమ్మారు. ఈమేరకు వీరికి రూ.63,63,57,600 బోనస్ అందాల్సి ఉండగా.. కొనుగోళ్లు పూర్తయి నెలలు గడుస్తున్నా జమ కాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



**ధాన్యం బోనస్ కోసం రైతుల ఎదురుచూపులు**

- జిల్లా రైతులకు రూ.63.63 కోట్ల బకాయి
- సాగుకు దన్నుగా ఉంటాయనుకుంటే నిరాశే
- మరో రెండు నెలల్లో మొదలుకానున్న ఖరీఫ్ కొనుగోళ్లు

**జోరుగా సన్నధాన్యం సాగు**

రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి బోనస్ ప్రకటించడంతో యాసంగిలో రైతులు అటే మొగ్గు చూపారు. సహజంగా ఈ సీజన్‌లో ఆరుతడి పంటల సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తుంటారు. రైతులు కూడా అతి తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. కానీ మద్దతు ధరకు తోడు బోనస్ వస్తుందని సన్నధాన్యాన్నే సాగు చేశారు. ఫలితంగా సాగర్ ఆయకట్టుతో పాటు ఇతర ప్రాంతాల్లో 2,10,830 ఎకరాల్లో వరి సాగు చేస్తే అందులో 1,29,064 ఎకరాల్లో సన్నరకాలే సాగయ్యాయి.

**18,893 మంది రైతుల నుంచి సేకరణ**

యాసంగి సీజన్‌లో సన్న, దొడ్డు రకాలు కలిపి 54,51,516 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు, రైతుల అవసరాలు పోగా 25,84,928 క్వింటాళ్ల సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సన్న రకాలు 18,53,370 క్వింటాళ్లు ఉన్నాయి. అయితే 18,893 మంది రైతుల నుంచి 12,70,653.60 క్వింటాళ్ల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ సేకరించింది.

**రూ.63.63 కోట్లు బకాయి**

యాసంగిలో సన్నరకం ధాన్యం సాగు చేయడం ఒక ఎత్తయితే.. ఆ ధాన్యాన్ని విక్రయించడం మరో సమస్యగా మారింది. అయినా మద్దతు ధరకు తోడు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని రైతులు భరించారు. అమ్మకం పూర్తికాగానే బోనస్ జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి 18,893 మంది రైతులకు రూ.63,63,57,600 బోనస్ అందాల్సి ఉంది. ప్రస్తుతం వానాకలం పంటల సీజన్ కొనసాగుతుండడంతో పెట్టుబడికి ఉపయోగపడుతుందనుకున్న బోనస్ రాకపోవడం గమనార్హం. మరో రెండు నెలల్లో ఈ వానాకాలంలో పండించిన ధాన్యం కొనుగోళ్లు కూడా మొదలవుతాయి. ఈ నేపథ్యాన యాసంగి సీజన్ బోనస్ చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**పలు మండలాల్లో రైతులకు అందాల్సిన బోనస్**

| మండలం | రైతులు | రావాల్సిన నగదు |
|---|---|---|
| నేలకొండపల్లి | 3,450 | రూ.11,99,44,800 |
| తల్లాడ | 1,890 | రూ.11,65,11,800 |
| కూసుమంచి | 2,202 | రూ.6,94,27,000 |
| కల్లూరు | 1,310 | రూ.6,49,00,8000 |
| ముదిగొండ | 1,980 | రూ.5,00,50,600 |
| వేంసూరు | 1,420 | రూ.3,75,31,800 |
| పెనుబల్లి | 1,053 | రూ.3,38,05,200 |
| టి.పాలెం | 1,282 | రూ.3,33,33,200 |
| సత్తుపల్లి | 1,056 | రూ.3,13,62,000 |
| ఖమ్మంరూరల్ | 986 | రూ.2,02,06,000 |

**అనేక అవస్థల నడుమ**

కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయానికి రైతులు అనేక అవస్థలు పడ్డారు. ధాన్యం కాంటాలు సమయానికి జరగక కేంద్రాల్లో రోజుల తరబడి ఉండాల్సి వచ్చింది. తేమ శాతం పేరుతో మిల్లర్లు క్వింటాకు 3 – 5 కేజీల తరుగు తీశారు. మరోవైపు లోడింగ్ కోసం లారీలు రాక ఇబ్బంది పడ్డారు. అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే ఆరబెడుతూ కాలం గడిపారు. ఇన్ని అవాంతరాల నడుమ ధాన్యం అమ్మినా బోనస్ రాక ఆవేదన చెందుతున్నారు.

**బోనస్ వస్తే కలిసి వస్తుంది..**



యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యాన్ని నేలకొండపల్లి కేంద్రంలో విక్రయించా. 50 క్వింటాళ్ల ధాన్యం అమ్మితే బోనస్ వెంటనే వస్తుందని చెప్పారు. వానాకాలం సాగు ఖర్చులకు బోనస్ ఉపయోగపడుతుందనుకున్నా. కానీ ఇప్పటికీ అందలేదు. బోనస్ కోసం అధికారులను అడిగితే ఏమీ చెప్పడం లేదు. ఇకనైనా చెల్లిస్తే ఖర్చులకు కలిసొస్తుంది.

– పోలంపల్లి జాన్, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

## 16 పోస్టులు.. 200మంది అభ్యర్థులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ అజయ్, అధికారులు

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించేలా పలు పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా పలు వురు దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యాన కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం తల్లాడ, ఏన్కూరు, పెనుబల్లి, వేంసూరు మండలాలకు చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నాలుగు మండలాల్లో కలిపి ఎనిమిది మంది ఇన్‌స్ట్రక్టర్లు, ఎనిమిది మంది ఆయాలను నియమించనుండగా.. ఇంటర్వ్యూలకు 200మందికి పైగా హాజరయ్యారు. సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, తహసీల్దార్లు, కరుణాకర్‌రెడ్డి, శేషగిరిరావు, శ్రీనివాసరావు, ఎంఈఓలు దామోదర ప్రసాద్, పత్తిపాటి నివేదిత వీరి విద్యార్హతలు, ఇతర అంశాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాగా, పెద్దసంఖ్యలో అభ్యర్థులు రావడం.. కార్యాలయంలో సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేక కార్యాలయ ఆవరణలోని చెట్ల కింద సేద తీరడం కనిపించింది.

## నేటి నుంచి డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం నంచి సోమవారం వరకు జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని బోనకల్ మండలం నారాయణపురంలో శనివారం మధ్యాహ్నం అధికారులు, అనధికారులతో ఆయన సమావేశమవుతారు. ఆతర్వాత రావినూతల నుంచి నారాయణపురం వరకు రూ.3.33కోట్లతో నిర్మించే బీటీ రోడ్డుతో పాటు జానకీపురం, తూటికుంట్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, జానకీపురంలో మధిర, బోనకల్ మండలాల కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో భట్టి సమావేశవుతారు. ఇక ఆదివారం మహదేవపురం, రాయపట్నం, నిధానపురం, మాటూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, 29వ తేదీ సోమవారం చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయడమే కాక సమావేశాల్లో పాల్గొంటారు.

# రెవెన్యూలో దిద్దుబాటు!

- వేంసూరు నుంచి ఇద్దరు ఆర్ఐల బదిలీ
- అక్రమార్కుల కట్టడికి కల్లూరు సబ్‌కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- 'సాక్షి' వరుస కథనాలతో చర్యలు

సత్తుపల్లి: రెవెన్యూ శాఖ ఉద్యోగులపై వస్తున్న అవినీతి, ఆరోపణలపై ఆ శాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈనెల 17న తల్లాడ తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐ మాలోతు భాస్కర్‌నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో 'సాక్షి'లో ఈ నెల 19న 'రెవెన్యూ'లో ఉలికిపాటు', 22వ తేదీన 'మరక మంచిదే..!' శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈమేరకు అంతర్గత విచారణ చేపట్టిన అధికారులు తహసీల్దార్ కార్యాలయాలలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగానే వేంసూరు తహసీల్‌లో ఆర్ఐలుగా పని చేస్తున్న శ్రీనివాసరావు, ఎస్.కే.జానీమియా బదిలీ వేశారు. శ్రీనివాసరావును కల్లూరు ఆర్‌డీఓ కార్యాలయానికి అటాచ్ చేయగా.. జానీమియాను ముదిగొండ ఆర్ఐగా నియమించారు. గత రెండు నెలల్లో రెండుసార్లు జానీమియాపై బదిలీ వేటు పడటం గమనార్హం.

**సబ్ కలెక్టర్ కొరడా**

కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధి ఆరు తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న వ్యవహారంపై సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ నిఘా పెట్టినట్లు సమాచారం. ఐఏఎస్ అధికారి కావడంతో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిసింది. మరక పడిన అధికారులను ఓ కంట కనిపెట్టేలా నిఘా ఉండడం రెవెన్యూ వర్గాలలో చర్చగా మారింది. రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగులపై ఫిర్యాదులు రాకుండా ప్రక్షాళన చేస్తుండడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి.

**ఆ ఆర్ఐ కథే వేరు**

వేంసూరు మండలం నుంచి బదిలీ అయిన ఇద్దరు ఆర్ఐల్లో ఒక ఆర్ఐ బదిలీ విషయంలో పలువురు లబోదిబోమంటున్నారు. అయితే, ఆయన నిజాయితీపరుడని కాకుండా అప్పులు ఇవ్వడం ఇందుకు కారణమైంది. కార్యాలయానికి వచ్చే ఎవరినీ వదలకుండా అప్పు రూపంలోనో, పనులు చక్కబెడతానంటూనో రూ.లక్షల్లో దండుకున్నాడని సమాచారం. దీంతో ఆయన ఇప్పుడు బదిలీ కాగా ఆ డబ్బు ఎలా రాబట్టుకోవాలని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

### కొందరు కొత్త.. ఇంకొన్ని కుర్చీలు ఖాళీ

ఏసీబీ దాడుల తర్వాత తల్లాడ తహసీల్ దాదాపు ఖాళీ అయింది. పాత తహసీల్దార్ స్థానంలో కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ–2 పోస్టుల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే, కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో యూడీసీ లక్ష్మయ్యను వేంసూరు ఆర్ఐగా బదిలీ చేశారు. అలాగే, జూనియర్ అసిస్టెంట్లు ఉబ్బన నాగేశ్వరరావు, సత్యవేణి, సునీత, ఆంజనేయులు కూడా ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. ఇకపోతే పెనుబల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఆర్ఐలు, కంప్యూటర్ ఆపరేటర్ సహా అందరూ నెల వ్యవధిలో చేరిన వారే కావడం విశేషం.

## వీర వనిత చాకలి ఐలమ్మ..

జయంతి వేడుకల్లో కలెక్టర్ అనుదీప్



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఆమె విగ్రహం వద్ద జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ అనుదీప్ పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. సమాజంలోని అసమానత్వం, దొరల దాష్టీకానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాడిన వీర నారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడేలా ప్రజల్లో స్ఫూర్తి నింపారని తెలిపారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జి.జ్యోతి, కార్పొరేటర్ బీ.జీ.క్లెమెంట్, రజక, బీసీ సంఘాల నాయకులు బొడ్డు ఉపేందర్, జక్కుల వెంకటరమణ, కనతాల నరసింహారావు, తుపాకుల ఎలగొండ స్వామి, గజ్జల వెంకన్న, పడిగల కృష్ణవేణి, కృష్ణారావు, రేగళ్ల సీతారాములు, సత్తెనపల్లి శ్రీను పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



కలెక్టరేట్‌లో బతుకమ్మ వద్ద ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, మద్దులపల్లి, వైరా మార్కెట్ల కార్యదర్శులు ఆంజనేయులు, మొహసీన్ సుల్తానా, ఉద్యోగులు పాల్గొన్నారు.



బతుకమ్మల వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా తదితరులు

■ ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జెడ్పీ సీఈఓ దీక్షారైనా పాల్గొన్నారు. తొలుత ఉద్యోగులతో కలిసి పూజలు చేశాక ఆమె బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి నిత్యకల్యాణం కనుల పండువగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపానికి తోడ్కొని వచ్చిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

## 'క్రిప్టో కరెన్సీ' కలకలం

- నకిలీ అకౌంట్లతో లావాదేవీలు?
- జిల్లాలోని పలువురి పేరిట వ్యవహారం




ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలో 'క్రిప్టో' కరెన్సీ వ్యవహారం కలకలం రేపుతోంది. పలువురి పాన్ కార్డులను ఉపయోగించి నకిలీ అకౌంట్లతో కొందరు లావాదేవీలు నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్న వ్యవహారం చర్చనీయాంశమైంది. రైతులు, కూలీలు, డెలివరీ బాయ్స్ పేరిట రూ.కోట్లలో క్రిప్టో కరెన్సీ లావాదేవీలు జరిగినట్లు సమాచారం. హైదరాబాద్, సిద్దిపేట, జగిత్యాలతో పాటు జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి ఈ వ్యవహారం చోటు చేసుకున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఖమ్మంకు చెంది ఓ ఫార్మా ఉద్యోగి, సత్తుపల్లిలో రైతు పేరిట రూ.50 కోట్ల వరకు లావాదేవీలు నడిచాయని చెబుతున్నారు. రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ ఈ వ్యవహారంపై దృష్టి సారించగా.. ఖమ్మం ఆదాయ పన్నుల శాఖ అధికారులు మాత్రం తమకెలాంటి సమాచారం లేదని వెల్లడించారు. పన్ను చెల్లింపుల్లో మోసాలకు పాల్పడితేనే గుర్తించే అవకాశముందని ఓ ఐటీ అధికారి తెలిపారు.

**క్రిప్టో కరెన్సీ అంటే...**

ప్రభుత్వం లేదా బ్యాంకు నియంత్రణ లేకుండా కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా కొనసాగే డిజిటల్ కరెన్సీ లేదా డిజిటల్ టోకెన్లను క్రిప్టో కరెన్సీగా వ్యవహరిస్తారు. ఇది ఆన్‌లైన్‌లో వ్యక్తుల(పీర్–టు–పీర్) మధ్య నేరుగా చెల్లింపులకు అవకాశం కల్పిస్తుంది. ఈ కరెన్సీ విలువ మార్కెట్ డిమాండ్, సరఫరా ఆధారంగా మారుతుంటుంది. 1990 నుంచి దీని మూలాలు ఉన్నప్పటికీ రహస్యంగా సాగాయి. ఆపై బిట్ కాయిన్ వెలుగులోకి వచ్చింది. వాడుక భాషలో కొందరు దీన్ని వర్చువల్ కరెన్సీగా కూడా పిలుస్తారు. 2018లోనే క్రిప్టోకరెన్సీపై రిజర్వ్ బ్యాంకు నిషేధం విధించగా.. పలు ఏజెన్సీలు వేసిన కేసు ఆధారంగా సుప్రీంకోర్టు 2020 మార్చిలో ఈ నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ నేపథ్యాన లావాదేవీలు విస్తరిస్తుండగా.. నకిలీ అకౌంట్లలో లావాదేవీలు జరిగినట్లు మొదలైన ప్రచారం జిల్లాలో కలకలం రేపుతోంది.

## 122 కాదు.. 116 వైన్స్‌షాపులే..

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు
- మిగిలిన షాప్‌లు హైదరాబాద్‌కు కేటాయింపు



ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 122 మద్యం దుకాణాలకు బదులు 116 వైన్స్‌కే దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈమేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఇందులో భాగంగా వ్యాపారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని పోలీస్ ఏసీపీ కార్యాలయం పక్కనే ఉన్న ఎక్సైజ్ స్టేషన్–1లో అన్ని ఎక్సైజ్ సర్కిళ్లకు స్టేషన్లకు సంబంధించిన దరఖాస్తులు తీసుకునేందుకు కౌంటర్లు సిద్ధం చేశామని వెల్లడించారు. అక్టోబర్ 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

**ఆరు షాపుల రద్దు**

గత ఎక్సైజ్ పాలసీలో 122 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించారు. అయితే, ఈసారి 116 వైన్స్‌కే గెజిట్ విడుదలైంది. మధిర ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆరు షాపుల్లో సరైన అమ్మకాలు లేనందున టెండర్లు తగ్గుతాయని భావించినట్లు సమాచారం. దీంతో ఆరు షాపులను హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి మార్చినట్లు తెలిసింది. అలాగే, గతంలో జిల్లా కేంద్రంలో ఆరు క్లస్టర్లు ఉండగా వాటిని ఈసారి మూడింటికి కుదించినట్లు సమాచారం. కాగా, జిల్లాలోని 116వైన్స్‌ల్లో 18 గౌడ కులస్తులకు, 14 ఎస్సీలకు, ఎనిమిది ఎస్టీలకు రిజర్వ్ చేశారు.

## క్లుప్తంగా

### కిష్టాపురం వాసికి డాక్టరేట్


ఆరేపల్లి వెంకట్రావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన ఆరేపల్లి వెంకట్రావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. సీబీఐటీ ప్రొఫెసర్ జి.సురేష్ బాబు, ఓయూ కళాశాల ప్రొఫెసర్ పి.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఆయన 'కంట్రోల్ అండ్ ఎనాలసీస్ ఆఫ్ ఐలాండెంట్ మైక్రో గ్రిడ్ సిస్టమ్ టూ ఆన్ బ్యాలెన్స్‌డ్ అండ్ నాన్ లీ నియర్ లోడ్' అంశంపై పరిశోధనా పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావును గ్రామస్తులు పలువురు అభినందించారు.

### ప్రైవేట్ ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం బాలాజీనగర్‌లోని శ్రీ సాయి నర్సింగ్ హోంను డీఎంహెచ్ఓ కళావతిబాయి శుక్రవారం తనిఖీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటరమణతో కలిసి తనిఖీ చేసిన ఆమె ఔట్ పేషెంట్ విభాగం, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించడమే కాక చికిత్సకోసం వచ్చిన వారి నుంచి వివరాలు సేకరించారు. వైద్యసేవల ధరలతో బోర్డు ఏర్పాటుచేయాలని తెలిపారు. సూచించారు. అలాగే, ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆస్పత్రి బాధ్యులు డాక్టర్ నారాయణ, పద్మావతికి సూచించారు.

### అస్వస్థతతో బాలుడి మృతి

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన దారా వెంకటేష్ కుమారుడు ఉదయ్‌కుమార్(5) శుక్రవారం మృతి చెందాడు. అస్వస్థతకు గురైన బాలుడికి తల్లి దండ్రులు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయన మృతికి కారణాలు తెలియకపోగా, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

### వీరి ఆచూకీ తెలిస్తే చెప్పండి

నిందితుల చిత్రాలు విడుదల చేసిన పోలీసులు


అపరిచిత మహిళ, మరో వ్యక్తి

ఖమ్మంక్రైం: బంగారు బిస్కెట్ పేరుతో కొణిజర్ల మండలానికి చెందిన మహిళ నుంచి ఆభరణాలు, నగదు తీసుకుని మోసం చేసిన అపరిచిత మహిళతో పాటు ఇంకో వ్యక్తి చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. అపరిచిత మహిళ ముందు వెళ్తూ చేతిలోని ప్యాకెట్ జారవిడిచి అందులో బంగారు బిస్కెట్ ఉందని నమ్మించగా, మరో వ్యక్తి విలువ రూ.లక్షల్లో ఉందని నమ్మబలికి మహిళను మోసం చేశారు. ఈమేరకు సీసీ కెమెరాల ద్వారా వీరిద్దని చిత్రాలను సేకరించి విడుదల చేశారు. వీరి ఆచూకీ తెలిస్తే 87126 59115 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్ బాబు సూచించారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 5,300 | 3,000 |
| ఏసీ మిర్చి | 14,850 | 8,000 |
| మిర్చి | 8,300 | 7,000 |
| కొత్త పత్తి | 7,500 | 4,300 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.19,107 |

# ధనలక్ష్మీదేవిగా అమ్మవారు

● కరెన్సీ మాలలతో అలంకరణ


ఏన్కూరు: రూ.11లక్షల కరెన్సీ మాలలతో మహలక్ష్మీదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు జిల్లాలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కోరూపంలో అలంకరించి పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ధనలక్ష్మి రూపంలో పూజించిన భక్తులు కరెన్సీ మాలలతో అమ్మ వారి విగ్రహాలు, మండపాలను అలంకరించారు. ఏన్కూరులోని డాక్టర్ నర్సయ్య కాంప్లెక్సు ఎదురుగా అమ్మ వారిని రూ.11లక్షల కరెన్సీతో ఏన్కూరు కోదండ రామాలయంలో రూ.5లక్షల కరెన్సీతో అలంకరించగా.. మధిర లడక్ బజార్‌లో దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యాన దుర్గాదేవిని రూ.3 లక్షల కరెన్సీ మాలలతో అలంకరించి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


మధిర: లడక్ బజార్‌లో కరెన్సీ నోట్లతో అలంకారంతో దుర్గాదేవి


ఏన్కూరు: రూ.5లక్షల కరెన్సీ మాలలలో అలంకారం

# మళ్లీ సమ్మెబాట

● కమీషన్ కోసం రేషన్ డీలర్ల నిర్ణయం
● స్పందించకపోతే వచ్చే నెల షాప్‌లు తెరవబోమని వెల్లడి
● రాష్ట్రం నిధులు వచ్చినా.. కేంద్రం నుంచి బకాయి



ఖమ్మం సహకారనగర్: రేషన్ డీలర్లు తమకు రావాల్సిన కమీషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ వరకు బకాయిలు విడుదల చేయకపోతే వచ్చేనెల షాప్‌లు తెరిచేది లేదని స్పష్టం చేశారు. ఈమేరకు వచ్చే నెల 1, 2వ తేదీల్లో ఉపవాస దీక్షలు చేపడుతామని, అతర్వాత 3వ తేదీ నుంచి దుకాణాలు బంద్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**రూ.5కోట్ల మేర బకాయి**

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ షాప్‌లు ఉన్నాయి. ఆయా షాప్‌ల డీలర్లకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలలు కమీషన్ అందాల్సి వస్తుంది. ప్రతీనెల కమీషన్ ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. క్వింటా బియ్యం ఇచ్చినందుకు కమీషన్‌గా రూ.140 ఇస్తుండగా అందులో కేంద్రం వాటా రూ.90, రాష్ట్రం వాటా రూ.50గా ఉంది. మొత్తంగా జిల్లా డీలర్లకు రూ.5కోట్ల మేర కమీషన్ బకాయి ఉన్నట్లు సమాచారం. ఇటీవల డీలర్లు సమ్మె చేస్తామని హెచ్చరించడంతో రాష్ట్రప్రభుత్వం తన ఐదు నెలల వాటాను గత నెల చివరలో విడుదల చేసింది. కానీ కేంద్రం నిధులు రాకపోవడంతో డీలర్ల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఈ నేపథ్యాన వచ్చే నెలలో సమ్మె బాట పట్టాలని నిర్ణయించారు.

**కేంద్రం స్పందించాలి..**



ఇటీవల రాష్ట్రప్రభుత్వం కమీషన్ నిధులు విడుదల చేసింది. కేంద్రం కూడా తక్షణమే విడుదల చేయాలి. కమీషన్ అందక డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీలర్ల సమస్యలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఇకనైనా స్పందించాలి.
– బి.వెంకన్న, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

**ఉన్నతాధికారులకు నివేదించాం**



రేషన్ డీలర్లకు సంబంధించి కమీషన్ నిధులను ఇటీవల రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. అయితే, కేంద్రం నుంచి రావాల్సిన వాటా పెండింగ్‌లో ఉంది. దీంతో డీలర్లు సమ్మె చేస్తామని ప్రకటించగా ఉన్నతాధికారులకు నివేదించాం. – చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

**ఆర్థిక ఇబ్బందులతో..**



గత ఆరు నెలలుగా కమీషన్ అందక డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీలర్ల సమస్యను గుర్తించి పండుగలోగా నిధులు విడుదల చేయాలి. కమీషన్ రాకపోవడంతో దుకాణాల నిర్వహణ కూడా కష్టంగా మారింది. – షేక్ జానీమియా, రేషన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

# మరి ఎవరిది బాధ్యత?

● కేఎంసీ పరిధి ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ చెల్లింపుల్లో సమస్యలు
● పనులు తమ హయాంలో జరగలేదని అధికారుల దాటవేత
● ఇబ్బంది పెట్టొద్దని కాంట్రాక్టర్ల ఆవేదన



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్లు విలువలో కొంత నగదును జమ చేయాల్సి ఉంటుంది. ఈఎండీ(ఎర్నెస్ట్ మనీ డిపాజిట్), ఎఫ్ఎస్‌డీ(ఫరదర్ సెక్యూరిటీ డిపాజిట్)ల రూపంలో కేఎంసీ ఖాతాకు జమ చేస్తే.. పనులు పూర్తయ్యాక నాణ్యతను పరీక్షించి అధికారులు తిరిగి చెల్లిస్తారు. అయితే, కొన్నేళ్లుగా ఈఎండీలు, ఎఫ్ఎస్‌డీల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు కేఎంసీ చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల కమిషనర్ అభిషేక్ అగస్త్య చొరవతో కాంట్రాక్టర్లకు చెల్లింపులు సాఫీగానే జరిగినా.. కొత్తగా వచ్చిన ఇంజనీరింగ్ అధికారుల తీరుతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

**ముందుగానే నగదు జమ**

కాంట్రాక్టర్లకు పనులు కేటాయించే సమయాన అధికారులు ఈఎండీ కట్టించుకుంటారు. ఈఎండీ రూపంలో పని విలువ ఆధారంగా 1 – 1.50 శాతం వరకు కట్టించుకుంటుండగా.. 2.50శాతం ఎఫ్ఎస్‌డీగా కేఎంసీ ఖాతాలోనే ఉంచుతున్నారు. పనులు పూర్తయిన ఆరు నెలల నుండి మూడేళ్ల లోపు కాంట్రాక్టర్‌కు వీటిని తిరిగి చెల్లించాలి. అయితే కేఎంసీలో ఎఫ్ఎస్‌డీని 2.50 శాతం నుండి 7 శాతం వరకు అంటిపెట్టుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పుడు వీటి చెల్లింపులపై అధికారులు – కాంట్రాక్టర్లకు మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి.

**అప్పుడు మేం లేము...**

ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)లుగా కేఎంసీలో బాధ్యతలు చేపట్టిన ఇంజనీరింగ్ అధికారుల తీరును కాంట్రాక్టర్లు తప్పు పడుతున్నారు. గతంలో తాము చేసిన పనులకు సంబంధించి ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ చెల్లించాలని కాంట్రాక్టర్లు ఇంజనీరింగ్ అధికారులను కోరితే.. పనులు జరిగిన సమయాన తాము విధుల్లో లేమంటూ దాటవేత ధోరణి పదర్శిస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజులుగా ఏఈల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఇదే సమస్యపై కమిషనర్‌ను కలిస్తే బిల్లులు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసినా అధికారులకు పెడచెవిన పెడుతున్నారని వాపోతున్నారు. పనులు జరిగిన సమయాన ఉన్న అధికారులు ఇప్పుడు ఇతర మున్సిపాలిటీలకు వెళ్లారని, ఉద్యోగుల బదిలీలు సహజమే అయినప్పుడు తమ బిల్లులు ఆపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**రూ.2 కోట్లకు పైగానే..**

గతంలో పూర్తి చేసిన పనులకు సంబంధించి ఈఎండీలు, ఎఫ్ఎస్‌డీల బకాయి రూ.2 కోట్లకు కేఎంసీ ఖాతాలో ఉన్నట్లు తెలుస్తోంది. పనులు చేసేందుకు రూ.కోట్ల అప్పులు తీసుకొస్తున్న తాము ఈఎండీలు, ఎఫ్ఎస్‌డీ చెల్లింపుల్లో కేఎంసీ అధికారులు తీరు కారణంగా మరింత ఇబ్బంది పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈఎండీలు, ఎఫ్ఎస్‌డీలపై ఇంజనీరింగ్ అధికారుల వ్యవహరిస్తున్న తీరుపై కాంట్రాక్టర్లు జట్టుగా జిల్లా ప్రజాప్రతినిధులను కలవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

**కాంట్రాక్టర్, ఏఈ నడుమ వాగ్వాదం**

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓ కాంట్రాక్టర్, ఏఈ మధ్య శుక్రవారం వాగ్వాదం చోటు చేసుకుంది. కమిషనర్ పేషీ వద్ద వీరిద్ద మధ్య మొదలైన మాటల యుద్ధం చివరకు తీవ్ర స్థాయికి చేరింది. అక్కడ ఉన్న సిబ్బంది, ఇతర కాంట్రాక్టర్లు వారిని వారించారు. ఈఎండీలు, ఎఫ్ఎస్‌డీలు చెల్లించాలని కొద్దిరోజులుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈవిషయంలోనే ఏఈని అడగగా గతంలో జరిగిన పనులకు సంబంధించి తనకు తెలియదంటూ దాటవేయడంతో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. కాగా, కాంట్రాక్టర్, ఏఈ మధ్య వాగ్వాదంపై కొందరు కాంట్రాక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

## మహిళలు పోరాటాల్లోకి రావాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి

బోనకల్: పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలు పోరాటాల్లోకి రావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. బోనకల్ మండలం ముష్టికుంట్లలో ఐద్వా మధిర డివిజన్ మహాసభ పయ్యావుల ప్రభావతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత పతాకాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ ఆవిష్కరించగా అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించాక మల్లు లక్ష్మి మాట్లాడారు. మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారన్నారు. ఐద్వా పోరాటాల ఫలితంగానే అనేక హక్కులు సాధించుకున్నామని తెలిపారు. మహిళలు లేకపోతే వ్యవస్థ లేదని వెల్లడించిన ఆమె బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, వేధింపులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మధిర డివిజన్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జొన్నలగడ్డ సునీత, కళావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు బండి పద్మ, మెరుగు రమణ, జొన్నలగడ్డ సునీత, బంధం వెంకటరాజ్యం, రజిత, కొంగర వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ డీడీ మణెమ్మకు పదోన్నతి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో డీడీగా పనిచేస్తున్న మణెమ్మకు జేడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భద్రాచలం ఐటీడీఏలో 2023 జూలై 7న డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు మణెమ్మకు పదోన్నతి కల్పిస్తూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెకు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

## భర్తను హత్య చేయించిన భార్య

వివాహేతర సంబంధమే కారణం

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి జిలుగుమాడులో ఈనెల 8న అనుమానాస్పద స్థితిలో బాలసాని మురళి(35) మృతి చెందగా విచారించిన పోలీసులు హత్యగా తేల్చారు. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆయన భార్యే హత్యకు సూత్రధారిగా గుర్తించారు. మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ దోమల రమేష్ శుక్రవారం తెలిపిన వివరాలు.. బాలసాని మురళి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా కేసు నమోదు చేసుకుని విచారించడంతో నలుగురు వ్యక్తులు హత్య చేసినట్లు తేలింది.

**విడాకులు ఇవ్వకపోవడంతో..**

జిలుగుమాడుకు చెందిన మురళికి చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన మాధవి(ముత్తమ్మ)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే, పదేళ్లుగా మాధవికి, పొద్దుటూరు వాసి దుగ్గిరాల కార్తీక్‌తో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం తెలిసి భర్త మందలించినా తీరు మార్చుకోని మాధవి ఏకంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఆపై తనకు విడాకులు ఇవ్వాలని కోరినా మురళి అంగీకరించలేదు. దీంతో కక్ష పెంచుకున్న మాధవి ఈనెల 8న రాత్రి దుగ్గిరాల కార్తీక్, బొజ్జగాని వెంకటేశ్వర్లు అలియాస్ పొట్టోడు, మానుపుడి గోపాల్‌రావు అలియాస్ మేడ గోపితో కలిసి జిలుగుమాడుకు వచ్చి మురళిని హతమార్చి వెళ్లిపోయారు. మరుసటిరోజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారించడంతో వివాహేతర సంబంధం నేపథ్యాన భర్త అడ్డు తొలగించేందుకు భార్య మాధవే హత్య చేయించినట్లు తేలింది. ఈమేరకు నలుగురిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన మధిర టౌన్ ఎస్సైలు కిషోర్, చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్‌హెచ్ఓ రమేష్ అభినందించారు.

## ప్రముఖ వ్యాపారి జీఆర్ఆర్ మృతి

నివాళులు అర్పించిన నేతలు, వ్యాపారులు


రామారావు (ఫైల్)


నివాళులర్పిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు

ఖమ్మంవ్యవసాయం: ప్రముఖ పత్తి వ్యాపారి గొడవర్తి రామారావు(83) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఖమ్మంలోని స్వగృహంలో మృతిచెందారు. కామేపల్లి మండలం కొత్త లింగాలకి చెందిన రామారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, ఆతర్వాత ఎంఈఓగా పనిచేసి రిటైర్ అయ్యారు. అనంతరం వ్యాపారంపై మక్కువతో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో దిగుమతి శాఖ సభ్యుడిగా చేరిన రామారావు కమీషన్ వ్యా పారం చేస్తూ ఖమ్మంలోనే స్థిరపడ్డారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రావడంతో ఆయనను వ్యాపారులు 'పత్తి పంతులు గారు'గా పిలుస్తారు. ఖమ్మం రూరల్ మండలంలో జిన్నింగ్ మిల్లులు కూడా ఏర్పాటుచేసిన ఆయన భార్య గౌరమ్మ ఈ ఏడాది ఏప్రిల్ 2న మరణించగా ఆరునెలలు గడవకుండానే రామారావు సైతం కన్నుమూశారు. కాగా, ఆయన కుమారులు గొడవర్తి శ్రీనివాసరావు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శిగా పనిచేయగా, నాగేశ్వరరావు స్తంభాద్రి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే, జీఆర్ఆర్‌కు కుమార్తె దమ్మాలపాటి రమాదేవి ఉన్నారు. కాగా, రామారావు మృతదేహం వద్ద ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, బాధ్యులు జీవైనరేష్, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్ రావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్‌కుమార్, నల్లమల ఆనంద్, తూములూరి లక్ష్మీనరసింహా రావు, కురువెల్ల ప్రవీణ్‌కుమార్, సోమారపు సుధీర్‌కుమార్, మేడ బోయిన లింగయ్య, సిరికొండ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్‌నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, దండా జ్యోతి రెడ్డి, ముత్యాల వెంకటప్పారావు, యలమద్ది రవి, దొండేటి అశ్వనీకుమార్, చావా శ్రీనివాస్, ఎర్ర అప్పారావు, వీరభద్రం, కందాల వీరేందర్ తదితరులు నివాళులర్పించారు. అలాగే, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు రామారావు కుమారులను ఫోన్‌లో పరామర్శించారు.

## ఐక్యతతోనే కాపు కార్పొరేషన్ సాధన


దేవయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండడం ద్వారా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, నిధుల సాధన సాధ్యమవుతుందని మున్నూరు కాపు సంఘం రాష్ట అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం జరి గిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల సమయాన ప్రతీ ఇంట వివరాలు నమోదు చేయించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శెట్టి రంగారావు, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి దేవేందర్, కార్యదర్శిగా గోవిందు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా సూరంశెట్టి కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేముల కృష్ణప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆతర్వాత దేవయ్యను నాయకులు సత్కరించారు. ఈసమావేశంలో నాయకులు కొత్త సీతారాములు, పోదిల రవికుమార్, జనార్దన్, నాగ భూషణం, శ్రీదేవి, రాపర్తి శరత్, చామకూరి వెంకటనారాయణ, మాదురి పూర్ణ, మదూరి సైదారావు, జేవీఎల్.నరసింహారావు, నరేష్, చెరుకూరి పూర్ణ, మాదంశెట్టి హన్మంతరావు, విప్లవకుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సోమయ్య, సూరయ్య, ఆర్.కే. నాయుడు, జయప్రకాష్ పాల్గొన్నారు.







# బీసీల రిజర్వేషన్లపై కేంద్రం నిర్లక్ష్యం

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్
● కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్ష.. విరమింపచేసిన పోలీసులు


దీక్షలో పాల్గొన్న శ్రీనివాస్, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల రిజర్వేషన్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఆయనతో పలువురు నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో నష్టపోకుండా తక్షణమే రిజర్వేషన్లు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బీజేపీ ఎంపీలతో పాటు అన్ని పార్టీల నాయకులు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కాగా, దీక్షకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీసీ సంఘాల నాయకులు డాక్టర్ దయానంద్, నీరజాదేవి, దోమ ఆనంద్‌బాబు, సుజలాదేవి, పుచ్చకాయల వీరభద్రం, గుండాల కృష్ణ, బొమ్మ రాజేశ్వరరావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీల రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉందని తెలిపారు. అలాగే, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కత్తి నెహ్రూగౌడ్, పెళ్లూరి విజయ్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, చిట్టోజు రమేష్, పుల్లయ్య, వరలక్ష్మి, మేడేపల్లి కృష్ణమాచారి, లింగనబోయిన పుల్లారావు, మసనం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, శిబిరం వద్దకు రఘునాథపాలెం పోలీసులు చేరుకుని దీక్షను విరమింపచేశారు.

**దీక్షకు మద్దతు**

కల్లూరు/కల్లూరు రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చేపట్టిన ఆమరణ దీక్షకు కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈఏరకు కల్లూరు నుంచి కాంగ్రెస్, బీసీ సంఘం నాయకులు లక్కినేని కృష్ణ, పెద్దబోయిన శ్రీనివాసరావు, రాజబోయిన శ్రీనివాసరావు, మట్టా రామకృష్ణ, తోట సుబ్బారావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, ఆళ్లకుంట నరసింహారావు, కొడవటి వెంకటేశ్వరరావు, రాచపోయిన శ్రీను, సుబ్బారావు హాజరయ్యారు.



● కేరెంటింగ్

# మాటే... బాట

జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనల గురించి తల్లిదండ్రులు తరచూ పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి. మన మాటలతోనే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఆ మాటలు ఎలా ఉండాలంటే...

**ఒక వ్యక్తి ప్రవర్తన వారు చూసిన, దగ్గరగా మసలిన వ్యక్తులు, వారి చుట్టూ ఉన్న ప్రపంచంపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో పరిసరాలు, మనుషుల ప్రభావం అధికంగా ఉంటుంది. అందుకే పిల్లలు తరచూ అనేక ఆలోచనలు, సందేహాలతో సతమతమవుతుంటారు. ఇవి ఒకదాన్ని ఒకటి డామినేట్ చేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తుండాలి.**

### అంతర్గత సౌందర్యమే అసలైన అందం

పిల్లలు టీనేజ్ లేదా యుక్తవయసుకు వచ్చినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పాళ్లు చాలా తక్కువగా ఉంటాయి. అన్ని విషయాల్లో ఇతరులతో పోల్చుకుని వారి కన్నా తాము తక్కువని ఫీలవుతుంటారు. శరీరం రంగు విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆ వయసులో వారికి అర్థమయ్యేలా వివరించడం కొంత కష్టం అయినప్పటికీ అందం తాత్కాలికమని, అసలు అందం అంటే తెలుపు, నలుపు రంగులకు సంబంధించిన విషయం కాదని చెప్పాలి. అలాగే ఎత్తు, బరువు, ఆకృతి అందచందాలకు గుణగుణాలకు కొలమానం కాదని, అంతర్గత సౌందర్యం మాత్రమే అసలైన అందమని వారికి విడమరచి చెప్పాలి. మన ప్రతిభను ప్రపంచానికి చూపేందుకు అనేక మార్గాలున్నాయని వారికి తెలియజెప్పాలి.

### మీ కలలకు మేం రంగులద్దుతాం!

కలలు కనడం ఏమీ చెడ్డ విషయం కాదు. అయితే అవి ఆచరణసాధ్యం కానివి...పరిమితికి మించినవి కావడం మాత్రం కష్టంగా అనిపించే విషయం. పిల్లలు తాము ఎలా ఉండాలి? ఎవరిలా ఉండాలి... అనే విషయం గురించి తరచూ ఆలోచిస్తుంటారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల్లా ఉండాలని కోరుకుంటారు. మరికొందరు అంతకంటే మిన్నగా బతకాలని, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇంకా ఉన్నతస్థాయిలో ఉండాలని కోరుకుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇలాగే ఉండాలని శాసించకూడదు. వారి ఆలోచనలను తెలుసుకుని, కలలను సాకారం చేసుకోవడంలో తోడ్పడాలి. తమను తాము తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సలహాలు మాత్రమే ఇవ్వాలి. ఒకవేళ వారికి ఈ విషయంలో స్పష్టత లేకపోతే నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించాలి.

### ఎలాంటి స్నేహాన్ని ఎంచుకోవాలంటే..?

మిత్రలాభం, సావాస దోషం ఈ రెండూ స్నేహం వల్ల కలిగే లాభ నష్టాలను సూచించే పదాలు. ఎందుకంటే స్నేహం పిల్లలను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఒకేవ్యక్తితో సావాసం చేయడం అన్నివేళలా అంత మంచిది కాదు. పెరుగుతున్న కొద్ది స్నేహాలు కొంత క్లిష్టంగా మారుతుంటాయి. అందుకే తోటివారినెవరినీ విడదీసి చూసి ఎంపిక చేసుకునే బదులు అందరితో కలివిడిగా ఉండటం నేర్పాలి.. మంచి స్నేహితులు ఎప్పుడూ మిమ్మల్ని తక్కువగా చూడరు. అగౌరవపరచరు. మీ స్నేహాన్ని ఆస్వాదిస్తారు.. విశ్వాసపాత్రులుగా ఉంటారని వారికి వివరించి చెప్పాలి.

### పోల్చిచూడవద్దు

కోరికలు, అవసరాలకు అంతనేది ఉండదు. మన దగ్గర ఉన్నదాంట్లో తృప్తి పడటం నేర్చుకోవాలి. అందుకు సదా కృతజ్ఞులమై ఉండాలి. అంతే తప్ప తోటివారితో పోల్చుకుని వారి వద్ద ఉన్నవి, అనుభవిస్తున్నవి మన దగ్గర లేవని బాధపడకూడదని చెబుతుండాలి.

### ప్రవర్తనా లోపాలు ఉండరాదు

కొంతమంది పిల్లలు తోటి విద్యార్థులను బెదిరిస్తుంటారు. తల్లిదండ్రులను చిన్నచూపు చూస్తూ అవమానిస్తుంటారు. ఈ ప్రవర్తనను మొగ్గలోనే తుంచి వేయాలి. లేకపోతే మనం అమ్మానాన్నలుగా విఫలం అయినట్లే లెక్క. ఇతరులను బెదిరించడం, ఎగతాళి చేయడం తప్పని, పైగా అది ఇతరులకే కాదు, వారికి కూడా ఎంతో హాని కలిగించే విషయం కూడానని చెప్పాలి. అందుకే ఇంటిని, బడిని పిల్లలకు సురక్షితమైన ప్రదేశాలుగా ఉంచటం అత్యవసరం.

### ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

దేవుడు మానవుల ఆత్మల్లో కొలువై ఉంటాడని, ఒకరికొకరు సాయం చేసుకోవడం, ఇతరులను గౌరవించడం నిజమైన దైవారాధన అని రవీంద్రనాథ్ ఠాగూర్ తరచూ బోధించేవారు. ఇలాంటి మహనీయుల ఆదర్శ వాక్యాలను పిల్లల మనసులో నాటుకునేలా తల్లిదండ్రులు పదే పదే చెబుతుండాలి.స్థాయీ భేదాలు, లైంగిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని చెప్పాలి. ఎవరూ తక్కువ కాదని, స్త్రీలు లైంగిక వస్తువులు కాదు... పురుషులంటే వారిని హింసించే వేటగాళ్లు కాదు... ఎవరూ ఎవరికీ సేవకులు లేదా బానిసలు కాదని చెప్పాలి.

### సంతోషమే ఏకైక మార్గం

మనస్సును ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుకోవాలి. ఎవరైనా సంతోషంగా ఉండాలంటే మీ ముందున్న ఏకైక మార్గం మీ తోటివారిని సంతోషంగా ఉంచడమేనని తెలియజెప్పాలి.

### అభిరుచులూ ముఖ్యమే!

చదువుకు అడ్డం అంటూ పిల్లలను క్రీడలు, లలిత కళలు లేదా ఇతర అభిరుచులకు దూరం చేయకూడదు. ఇవేమీ లేకుండా కేవలం చదువు ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోవాలి, మరే అభిరుచులూ ఉండకూడదంటే అది వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తుందని గుర్తుంచుకోండి

### మంచితనమే మిన్న

ఏమి జరుగుతుందో అది జరుగుతుంది. మనం ఏం చేస్తే అదే మనకు తిరిగొస్తుంది. అది మంచయినా... చెడయినా... అందుకే ఎప్పుడూ తోటి వారితో సామరస్యంతో, మంచితనంతో ఉండాలని పిల్లలకు నేర్పించాలి.

లైఫ్@360

● అయ్యంగార్ యోగ

# మల్లిక ఫిట్‌నెస్ మంత్ర



48 సంవత్సరాల వయస్సులో కూడా చక్కటి సౌష్ఠవంతో యువ నటీమణులతో పోటీపడుతున్న బాలీవుడ్ నటి మల్లికా షెరావత్. ఆమె తనను ఫిట్‌గా ఉంచే అయ్యంగార్ యోగా సాధన గురించి ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

వేగంగా బరువు తగ్గాలని, తొందరగా ఫిట్‌నెస్ పెంచుకోవాలని ఇంచుమించు అందరూ అనుకుంటారు. అయితే అలాంటి క్విక్-ఫిక్స్ డైట్‌లు, ట్రెండింగ్ వర్కౌట్‌లు, సోషల్ మీడియా ట్రిక్స్ మూలంగా వచ్చిన ఫిట్‌నెస్ అంతే తొందరగా కరిగిపోతుందని తెలుసుకోలేక చాలామంది స్థిరమైన ఫిట్‌నెస్ మార్గాన్ని గాలికి వదిలేస్తుంటారు.

### నా ఫిట్‌నెస్ ఫిలాసఫీ

''నా ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు యోగా చేయడమే కారణం. అంతేగానీ ఫ్యాషన్ డైట్‌లు లేదా క్రాష్ ప్రోగ్రామ్‌లు కాదు' అని మల్లిక ఇన్‌స్టా సాక్షిగా తేల్చి చెప్పింది. ఆరోగ్యంగా ఉండాలన్న తపన.. క్రమశిక్షణ, స్థిరత్వం తన అతి పెద్ద సాధనాలని నొక్కి చెప్పింది. ట్రెండీ ఫిట్‌నెస్ హ్యాక్‌లను ఆమోదించే చాలా మంది సెలబ్రిటీల మాదిరిగా కాకుండా, మల్లికా దీర్ఘకాలిక అలవాట్లను పెంపొందించుకోవడం వైపే మొగ్గు చూపుతుంది. అందుకే అయ్యంగార్ యోగాను తన దినచర్యలో భాగంగా మార్చుకుంది.

ఫిట్‌నెస్‌ను తాను తాత్కాలికంగా తీసుకోలేదని, దానిని తన జీవనశైలిలో భాగంగా చేసుకున్నానని చెబుతూనే, అయ్యంగార్ యోగా వల్ల తన శరీరాన్ని షేప్ కోల్పోకుండా ఉంచుకోవడమే కాకుండా, తన బిజీ జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడానికి, ముఖ్య విషయాల మీద దృష్టి పెట్టడానికి సహాయపడిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది.

### ఏమిటీ అయ్యంగార్ యోగా?

అయ్యంగార్ యోగకూ పతంజలి ఋషి యోగ సూత్రాలకూ అవినాభావ సంబంధం ఉంది. అష్టాంగ యోగా ఎనిమిది అంశాలను ఆచరణాత్మక వ్యవస్థలో మిళితం చేస్తుంది. అధికారిక అయ్యంగార్ యోగా వెబ్‌సైట్ ప్రకారం, దాని క్రమం, ఆధారాల ఉపయోగం, భద్రతపై ప్రాధాన్యత దీనిని ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా అభ్యసించే యోగా రూపాలలో ఒకటిగా మార్చాయి.

అయ్యంగార్ యోగాలో కీలకమైన అంశం ఏమిటంటే పట్టీలు, బోల్‌స్టర్లు, బ్లాక్స్, తాళ్లు వంటి ఆధారాలను ఉపయోగించడం. ఈ సాధనాలు ప్రారంభకులకు అధునాతన అభ్యాసకులకు సరైన భంగిమను సాధించడంలో సహాయపడతాయి. అదే సమయంలో గాయం ప్రమాదాలను తగ్గిస్తాయి. ఇది అభ్యాసాన్ని అత్యంత సమగ్రంగా చేస్తుంది. అన్ని వయసుల వారికి, ఫిట్‌నెస్ స్థాయిలకు అనుకూలంగా ఉంటుంది.

# మెదడుకు చురుకైన ఆహారం



రోజువారీ ఆహారంలో కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, మంచి కొవ్వు, మరిన్ని... దశాబ్దాలుగా, మెడిటేరియన్ డైట్ తీసుకోవడం వల్ల మెదడు వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**గ్రీన్ టీ:** ఇది మీ న్యూరాన్లకు శక్తినిస్తుంది: గ్రీన్ టీలో కాటెచిన్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి వాపులను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కావలసిన శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఇవి న్యూరోడీజనరేషన్‌కు కీలకంగా పనిచేస్తాయి.

### మెదడు పనితీరును పెంచే మొక్క మన్కై

దీనిని 'డక్ వీడ్' అని కూడా పిలుస్తారు, మన్కై అనేది పాలీఫెనాల్స్, బీ12, మొక్కల ఆధారిత ప్రోటీన్లతో నిండిన ఒక చిన్న వాటర్ ప్లాంట్. ఇది మెదడు వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న కీలక ప్రోటీన్‌లను నియంత్రించడంలో సహాయ పడుతుంది.

### చెడును తొలగిస్తుంది, మంచిని జోడిస్తుంది

గ్రీన్-మెడ్ ప్రణాళిక ఆరోగ్యకరమైన పదార్థాలపై మాత్రమే కాదు, ఇది రెడ్ మీట్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్‌లను కూడా తగ్గిస్తుంది, రెండూ వృద్ధాప్యంతో ముడిపడి ఉన్నాయి.

### మెడిటరేనియన్ డైట్ అంటే...

పుష్కలంగా పండ్లు, కూరగాయలు, బ్రెడ్ ఇతర ధాన్యాలు, బంగాళదుంపలు, బీన్స్, గింజలు, ఆలివ్ నూనెనే ఎక్కువగా వాడతారు. పాల ఉత్పత్తులు, గుడ్లు, చేపలు వంటివి మెడిటరేనియన్ డైట్ లో మితంగా తీసుకుంటారు. ఈ ఆహారంలో రెడ్ మీట్ కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. మొక్కల ఆధారిత ఆహారాలనే ఎక్కువగా తింటారు.



# వ్యాపించకుండానే వాష్ చేసేద్దాం

అంటువ్యాధులతోపాటు రకరకాల సీజనల్ వ్యాధుల వ్యాప్తిని, ఇన్ఫెక్షన్లను నివారించడానికి అతి తేలికైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి 'హ్యాండ్‌వాష్'. అవును, నిజమే. చేతుల పరిశుభ్రత వల్ల జీర్ణకోశ వ్యాధులు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు గణనీయంగా తగ్గుతాయని శాస్త్రీయ అధ్యయనాలు చూపిస్తున్నాయి. సబ్బుతో చేతులు కడుక్కోవడం, ముఖ్యంగా టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, తినడానికి ముందు, చర్మంపై ఉన్న చాలా సూక్ష్మజీవులను సమర్థంగా తొలగించగలదు. ముఖ్యంగా వర్షాకాలంలో, వర్షంలో తడిసినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధుల వ్యాప్తి గణనీయంగా తగ్గుతున్నట్లు అధ్యయనంలో రుజువైంది.

సాక్షి సినిమా



● ప్రభాస్



● మహేశ్‌బాబు



● ఎన్టీఆర్



● రామ్‌చరణ్



● నాని

# మిషన్ మేకోవర్

**కథ డిమాండ్ మేరకు సినిమా సినిమాకు కొత్త లుక్స్‌లోకి మారిపోతుంటారు హీరోలు. కథల్లోని హీరో క్యారెక్టరైజేషన్‌కు తగ్గట్లుగా గెటప్ మార్చేస్తుంటారు. ఇలా తమ కొత్త సినిమాల కోసం కొందరు హీరోలు ఒక 'మిషన్' మీద ఉన్నారు. ఆ మిషన్ ఏంటంటే 'మేకోవర్'. ఈ 'మిషన్ మేకోవర్' విశేషాలు తెలుసుకుందాం.**

### రాముడి పాత్రలో..?

సిల్వర్ స్క్రీన్‌పై లాంగ్ హెయిర్, గడ్డంతో మహేశ్‌బాబు కనిపించి చాలా సంవత్సరాలైంది. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) సినిమా కోసం మహేశ్ బాబు పూర్తిగా మేకోవర్ అయ్యారు. హెయిర్, గడ్డం పెంచారు. అలాగే వర్కౌట్స్‌తో ఫిజికల్‌గా కూడా ధృడంగా తయారయ్యారు. కాగా ఈ కథకు మైథలాజికల్ టచ్ కూడా ఉందని, ఈ చిత్రంలో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్త నిజం అయితే 'ఎస్ఎస్ఎమ్ బీ29'లో మహేశ్ బాబును ప్రేక్షకులు పలు రకాల లుక్స్‌లో చూసే అవకాశం ఉంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది నవంబరులో ఈ సినిమా అప్‌డేట్‌ను ఇస్తామని రాజమౌళి చెప్పారు. నవంబరులో ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేస్తారని భోగట్టా. దాదాపు రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చిలో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది.

### పోలీస్ ట్రైనింగ్

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ప్రభాస్. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు. ఈ హీరో పోలీస్‌గా కనిపించనున్న తొలి చిత్రం ఇదే. దీంతో 'ది రాజాసాబ్, ఫౌజి' చిత్రాల షూటింగ్ పూర్తికాగానే, 'స్పిరిట్'లో పవర్‌ఫుల్ పోలీస్ లుక్ కోసం ప్రభాస్ మేకోవర్ కావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకోనున్నారట. ఈ చిత్రంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ఇండియాలోని ప్రముఖ లొకేషన్స్‌తో పాటు మెక్సికో, యూకే వంటి విదేశీ లొకేషన్స్‌లోనూ 'స్పిరిట్' చిత్రీకరణ జరగనుంది. టీ సిరీస్ ఫిలింస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

### బరువు తగ్గాలని...

ఎన్టీఆర్ హెవీ వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియో ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ హీరో ఈ రేంజ్‌లో కష్టపడుతున్నది 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా కోసమే. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఆల్రెడీ సినిమా షూటింగ్ కొంత భాగం పూర్తయింది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారట. ఈ లుక్ కోసమే ఎన్టీఆర్ మేకోవర్ అవుతున్నారని తెలిసింది. ఈ లుక్ కోసం బరువు తగ్గే మిషన్ మీద ఉన్నారు. ఇక ఇటీవల ఓ యాడ్ షూటింగ్‌లో భాగంగా ఎన్టీఆర్ స్వల్పంగా గాయపడ్డారు. వైద్యులు ఆయనకు రెండు వారాల పాటు విశ్రాంతి సూచించారు. దీంతో ప్రస్తుతం ఎన్టీఆర్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. కోలుకున్న తర్వాత తిరిగి ఆయన 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ విదేశాల్లో ప్రారంభం కానుందని తెలిసింది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు టొవినో థామస్ విలన్ రోల్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

### ద్విపాత్రాభినయం?

'పెద్ది' సినిమా కోసం బరువు పెరిగారు రామ్‌చరణ్. సరైన వర్కౌట్స్, డైట్‌తో పూర్తిగా కొత్తగా మేకోవర్ అయ్యారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రామ్‌చరణ్ ఫస్ట్ లుక్ విడుదలైంది. కానీ ఈ లుక్ కాకుండా మరో లుక్‌లో కూడా రామ్‌చరణ్ కనిపిస్తారు. ఈ రెండో లుక్ కోసమే ఈ హీరో బరువు పెరిగారని తెలిసింది. ఇలా 'పెద్ది'లో రెండు లుక్స్‌లో కనిపించనున్నారనే టాక్ తెర పైకి రావడంతో ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ వేరియేషన్స్ ఉంటాయని, ఇందులో భాగంగానే డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారనే ఊహాగానాలూ ఉన్నాయి. త్వరలో ఈ విషయాలపై ఓ క్లారిటీ వస్తుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

### డిఫరెంట్ జడల్

'ది ప్యారడైజ్' ప్రపంచం కోసం పూర్తిగా మారిపోయారు హీరో నాని. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో జడల్ అనే డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు నాని. ఈ జడల్ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఇంటెన్స్ అండ్ హెవీ వర్కౌట్స్‌తో బరువు పెరిగారు. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో మోహన్‌బాబు, 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్ నెగటివ్ రోల్స్ చేస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 26న విడుదల కానుంది.

ఇలా తమ కొత్త సినిమాల కోసం లుక్స్, గెటప్స్ మార్చుకున్న, మార్చుకుంటున్న హీరోలు మరికొంతమంది ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు



● ఆయుష్మాన్, రష్మిక

# మా ప్రపంచం వేరు

ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ మిస్టరీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ చిత్రానికి 'ముంజ్యా' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ చిత్రంలో అలోక్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కా పాత్రలో రష్మికా మందన్నా నటించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ముంబైలో జరిగింది. శ్రద్ధా కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ''ఏ... నాటకాలు ఆపు... నీకేం కాలేదు, నా కొడుకు సైతాన్... సైతాన్, నేను నీతో ఉండలేను... మా ప్రపంచం వేరు'' అని అర్థం వచ్చే డైలాగ్స్ ఈ హిందీ ట్రైలర్‌లో ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా 'థామా' సినిమాను అక్టోబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు.

# వినోదాల విందు



● నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా కొత్త ప్రోమో వీడియోను టీజర్‌లా రిలీజ్ చేశారు మేకర్స్. ఓ ఆభరణాల ప్రకటనకు స్పూఫ్‌గా ఈ ప్రోమోను చేశారు. ''తనదైన కామెడీ టైమింగ్‌తో 'అనగనగా ఒక రాజు' సినిమాలో ప్రేక్షకులను అలరించనున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు వినోదాల విందుని హామీ ఇస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● లక్ష్య, అనన్యా పాండే

# చార్మినార్‌లో సందడి

స్టార్ట్ కెమెరా... టేక్ అన్నారు డైరెక్టర్ వివేక్ సోని. అంతే... హీరో లక్ష్య బైక్ స్టార్ట్ చేశారు... వెనకాల హీరోయిన్ అనన్యా పాండే కూర్చున్నారు. రయ్‌మంటూ బైక్ ముందుకు సాగింది. సీన్ పూర్తయింది. షాట్ ఓకే అన్నారు వివేక్. ఈ షూటింగ్ జరిగింది ఎక్కడంటే హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గర. ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో లక్ష్య, అనన్య కలర్‌ఫుల్‌గా కనిపించారు. అక్కడి జనాలు వీరిని గుర్తు పట్టి, చుట్టుముట్టారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. లక్ష్య, అనన్యా పాండే జంటగా నటిస్తున్న కాలేజ్ రొమాంటిక్ మూవీ 'చాంద్ మేరా దిల్' కోసమే ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఈ ఇద్దరూ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రం షూటింగ్‌ని వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. చార్మినార్ తర్వాత మరో పాపులర్ ప్లేస్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

● చార్మినార్ దగ్గర...

